సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



రైతన్నకు భరోసా

వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఈ ఏడాది (2023-24)కి సంబంధించి ఆఖరి విడత ఆర్థిక సాయం నేడు రైతుల ఖాతాలకు జమ కానుంది. - 8లో



తండ్రి చేతిలో తనయుడి హతం

చెన్నూరు మండలంలోని కొండపేట గ్రామంలో మద్యానికి బానిసైన కన్న కొడుకును తండ్రి మంగళవారం రోకలి బండతో తలపై మోది చంపాడు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

జిల్లాలో మంగళవారం 22.3 - 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

సమసమాజ నిర్మాత సీఎం వైఎస్ జగన్

స్వాతంత్ర్యం సిద్ధించి 76 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో అట్టడుగు, అణగారిన, బలహీన, మైనార్టీ వర్గాలతోపాటు అన్ని వర్గాలకు న్యాయం చేయడంతోపాటు ప్రతి ఇంటా మేలు జరిగేలా సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని పలువురు వక్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలో సాక్షి మీడియా ఆధ్వర్యంలో 'ప్రజా ప్రస్థానం' కార్యక్రమంలో భాగంగా 'సమ సమాజం.. నవనిర్మాణం' అన్న అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. సామాజిక న్యాయానికి ప్రతిరూపం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని.. అన్ని వర్గాల ప్రజలు ఆయనకు బాసటగా నిలుస్తారని తెలిపారు.



సమ సమాజం.. నవనిర్మాణం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ వర్గాల ప్రతినిధులు

- సేవకులను పాలకులు చేసిన ఘనత ముఖ్యమంత్రి
- చట్టసభల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట
- పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకే అగ్రస్థానం
- 'సమ సమాజం- నవనిర్మాణం' కార్యక్రమంలో వక్తలు


హాజరైన వివిధ వర్గాల ప్రజలు

వైవీయూ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేస్తూ నవసమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటు పడుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ ప్రాతికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు, ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమ సమాజం.. నవనిర్మాణం' అంశంపై నిర్వహించిన చర్చలో టీటీడీ పాలకమండలి సభ్యుడు సిద్దవటం యానాదయ్య, ఏపీ పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఏపీ హజ్‌కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, ఎస్సీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి, సామాజిక వేత్త ఎ. రఘునాథరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి వెంకటసుబ్బారెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సొహైల్, ఆకాశవాణి మాజీ అధికారి జయసింహలతోపాటు పలువురు మహిళలు, సామాజిక వేత్తలు, స్వచ్ఛందసేవాసంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో జరిగిన సామాజిక విప్లవంపై చర్చించారు. మహాత్మా జ్యోతిరావుఫూలే, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మాగాంధీల ఆలోచనలను వారసత్వంగా తీసుకుని సామాజికి న్యాయం చేస్తూ నవనిర్మాణానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, రఘునాథరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.వెంకటసుబ్బారెడ్డి, డాక్టర్ సొహైల్, ఆకాశవాణి మాజీ ఉద్యోగి జయసింహ, బంగారు మునెయ్య యాదవ్, జ్యోతి, పత్తి రాజేశ్వరి, ఎం.సుబ్బరాయుడు, కృష్ణవేణి, వేణుగోపాల్‌నాయక్, టి.పి.వెంకటసుబ్బమ్మ, ఇలియాస్‌బాషా, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవకులను పాలకులు చేసిన ఘనత



స్వాతంత్ర్యం సిద్ధించిన 75 ఏళ్ల తర్వాత, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఏర్పాటైన 60 ఏళ్ల తర్వాత చరిత్రలో నిలిచిపోయేలా నాయీ బ్రాహ్మణులకు టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమించడంతోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను చట్టసభలకు పెద్దసంఖ్యలో పంపి సామాజిక న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. రాష్ట్రంలో 1185 మంది నాయీ బ్రాహ్మణులు వివిధ ఆలయాల్లో పాలకమండలి సభ్యులుగా నియమితులు కావడం కంటే సామాజిక న్యాయం ఏముంటుంది. - సిద్దవటం యానాదయ్య, టీటీడీ పాలక మండలి సభ్యులు, కడప

50 శాతం మహిళా రిజర్వేషన్ అమలు



మహిళా బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం తెలిపి అమలులోకి రానప్పటికీ రాష్ట్రంలో మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. 41 బీసీలతోపాటు 70 సీట్లను ఎస్సీ, ఎస్టీ, మైనారీలకు కేటాయించి చట్టసభలకు పంపిన ఘనత ముఖ్యమంత్రిదే. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న చరిత్ర ఈ ప్రభుత్వంది. 2.58 వేల కోట్ల రూపాయలను డైరెక్ట్‌గా లబ్ధిదారులకు అందజేయడంతో పాటు చేనేత వర్గాలకు ప్రత్యేకంగా యేడాదికి రూ.24 వేలు అందిస్తున్నాం. - జింకా విజయలక్ష్మి, ఏపీ పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్, ప్రొద్దుటూరు

ముస్లిం మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత



గత పాలకులు ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగానే చూసేవారు. కనీసం ఒక్క మంత్రి కూడా లేకుండా కేబినెట్ ఉండగా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ముస్లిం మైనార్టీలకు అన్నింటా అగ్రస్థానం లభిస్తోంది. డిప్యూటీ సీఎం, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌లతోపాటు నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలులతోపాటు కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లుగా మొత్తం మీద 800 మందికి పైగా ముస్లిం మైనార్టీలకు పదవుల్లో ప్రాధాన్యత కల్పించారు. హజ్‌కమిటీ చైర్మన్‌కు కేబినేట్ హోదా కల్పించిన తొలి రాష్ట్రం మనదే. - గౌస్‌లాజం, ఏపీ హజ్‌కమిటీ చైర్మన్, జమ్మలమడుగు

సామాజిక విప్లవం



మహాత్మాజ్యోతిరావు పూలే కోరుకున్న విధంగా అందరికీ విద్యను అందించాలని నాడు-నేడు పథకంతో విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, మహాత్మాగాంధీ కోరుకున్న గ్రామస్వరాజ్యాన్ని గ్రామసచివాలయాల రూపంలోను, అంబేద్కర్ కోరుకున్న సామాజిక న్యాయాన్ని అన్ని వర్గాలు, కులాలకు చేయూత నివ్వడంతోపాటు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే సమసమాజ నిర్మాణం సాధ్యం. సాధారణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కార్యకర్తలను సైతం చట్టసభలకు పంపడంతో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామాజిక స్ఫూర్తిని ప్రపంచమంతా తెలిసేలా విగ్రహం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా సామాజిక న్యాయం కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. - కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రముఖ పాత్రికేయులు

న్యూస్‌రీల్

పంచాయతీలకు బీఐఎస్ సామగ్రి కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న బీఐఎస్ జేడీ రాకేష్

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ పంచాయతీ, అభివృద్ధి పనులకు సంబంధించి కొనుగోలు చేసే వస్తువులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్)కు లోబడి ఉండాలని ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. జిల్లా పరిషత్‌లోని డీసీఆర్‌సీ భవనంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు బీఐఎస్ ప్రమాణాలపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయకపోతే తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యలపై వివరించారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఫ్యాకల్టీ సురేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలులో గ్రామ పంచాయతీలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ సమావేశంలో వర్క్‌షాప్ పరిశీలకులు రమేష్, ఫ్యాకల్టీ మధుబాబు పాల్గొన్నారు.

వైవీయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న వైవీయూ వీసీ, కుల సచివులు, ప్రొఫెసర్లు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో డిసెంబర్ మాసంలో జరిగిన డిగ్రీ మూడు, నాలుగు సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ కుల సచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డితో కలసి విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీవోసీ మూడో సెమిస్టర్‌లో 64.38 శాతం ఫలితాలు వచ్చాయని తెలిపారు. మొత్తం 5,062 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 3259 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీవోసీ నాలుగు సెమిస్టర్ పరీక్షలను 8803 మంది విద్యార్థులు రాస్తే 4989 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 56.67 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు మమత, గంగయ్య పాల్గొన్నారు.

కార్డుదారులకు రాగిపిండి, జొన్నల పంపిణీ



కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం బియ్యం కార్డుదారులకు మార్చి 1వ తేదీ నుంచి కిలో బియ్యం బదులుగా కిలో రాగిపిండి, రెండు కిలోల జొన్నల పంపిణీకి చర్యలు చేపట్టిందని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాగి పిండి ధర మార్కెట్‌లో కిలో రూ.40లకు విక్రయిస్తుండగా, ప్రభుత్వం కేవలం రూ.11కే అందిస్తుందన్నారు. రాగుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుందన్నారు. బియ్యం, రాగిపిండి, జొన్నలతోపాటు అర కిలో చక్కెర, అర్బన్ ఏరియాల్లో రూ.16లతో గోధుమపిండిని కూడా తీసుకోవచ్చని వివరించారు. బియ్యంకార్డు దారులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని ఆయన సూచించారు.

ప్రశాంతంగా టెట్ ప్రారంభం

మొదటి రోజు ఆరు కేంద్రాలలో..


నంబర్లను పరిశీలించుకుంటున్న అభ్యర్థులు


కడప పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న టెట్ జిల్లా అబ్జర్వర్ వెంకట క్రిష్టారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్ (ఏపీ టెట్ -2024) కంప్యూటర్ బేస్ట్ పరీక్ష మంగళవారం జిల్లా వ్యాప్తంగా కేటాయించిన పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా ప్రారంభమైంది. నిర్ణీత సమయం కంటే ముందుగానే విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. వారిని సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఈ నెల 27వ తేదీ నుంచి మార్చి 6 వరకు ఏపీటెట్ పరీక్ష నిర్వహించనున్నారు. మొదటి రోజు ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లలో కడపలో నాలుగు కేంద్రాలు, ప్రొద్దుటూరులో రెండు కేంద్రాలలో ఈ పరీక్ష జరిగింది. ఉదయం 847 మంది విద్యార్థులకు గాను 715 మంది హాజరు కాగా 132 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 860 మందికి గాను 785 మంది హాజరు కాగా 75 మంది గైర్హాజరయ్యారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టుకు సంబంధించి కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం, అన్నమాచార్య, శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న టెట్ పరీక్ష కేంద్రాలను డీఈఓ మర్రెడ్డి అనురాధతో కలిసి మోడల్ స్కూల్స్ రాష్ట్ర డైరెక్టర్, టెట్ జిల్లా అబ్జర్వర్ మార్తాల వెంకట క్రిష్టారెడ్డి తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలలో వసతులపై ఆరా తీయడంతోపాటు పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అలాగే మధ్యాహ్న సెషన్‌లో ప్రొద్దుటూరులోని సాయి రాజేశ్వరి, వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు కళాశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు.

హాజరైన విద్యార్థుల వివరాలు

పరీక్షా కేంద్రం	ఉదయం	సాయంత్రం
కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల	181	190
కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల	114	125
శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్	153	182
అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్	97	100
వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్	92	99
శ్రీరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌టెక్నాలజీ	78	89
మొత్తం	715	785

ఇంటర్ పరీక్షలకు చకచకా ఏర్పాట్లు

- జారీ అవుతున్న హాల్‌టికెట్లు
- మార్చి 1 నుంచి పరీక్షలు ప్రారంభం
- అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- 29,942 మంది విద్యార్థులకు 69 కేంద్రాలు


పరీక్షా కేంద్రంలో సిద్ధం చేసిన టేబుళ్లు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది జిల్లాలో 152 జూనియర్ కళాశాలలకు సంబంధించిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 29,942 మంది విద్యార్థులు రాయనున్నారు. వీరికి సంబంధించిన హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో జారీ అవుతున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఇంటర్ విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్ని కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షల ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల నిఘా నీడలో నడవనుంది. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు పరీక్ష నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

69 పరీక్షా కేంద్రాలు

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 69 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు సంబంధించి 29,942 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 16,177 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 13,765 మంది రాయనున్నారు. 69 పరీక్షా కేంద్రాలకు 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 69 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతోపాటు 23 మంది కస్టోడియన్స్‌ను నియమించారు.

ప్రత్యేక ఫోకస్

ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అన్ని పరీక్షా కేంద్రాలలో కలిపి 1095 సీసీ కెమెరాలు అమర్చారు. వీటిని ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేశారు. కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తున్నారనే విషయాన్ని అటు బోర్డు నుంచి ఇంటర్మీడియెట్ అధికారులు, ఇటు జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నారు. దీంతోపాటు అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు పోలీసు బందోబస్తు ఏర్పాటే చేయనున్నారు. ఏ పరీక్షా కేంద్రంలో కూడా నేలబారు పరీక్షలకు వీలు లేకుండా పూర్తి స్థాయిలో పర్నీచర్ ఉండేలా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు.

పర్యవేక్షణ

జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు స్క్వాడ్ సభ్యులతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయన్నారు. అలాగే పరీక్షల నిర్వహణకు 1205 మంది ఇన్విజిలేటర్స్‌ను నియమించారు. ప్రశ్నాపత్రాలను పోలీసు బందోబస్తు నడుమ స్టోరేజ్ పాయింట్లలో భద్రపరిచారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీవీఈఓ శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య నేతృత్వంలో డీఈసీ కమిటీ సభ్యులు ఏర్పాట్లలో పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు.

జిల్లాలో వివరాలు ఇలా..

మేనేజిమెంట్	కాలేజీల సంఖ్య	కేంద్రాలు	మొదటి సంవత్సరం	రెండో సంవత్సరం
మోడల్	3	1	149	199
హెచ్ఎస్‌ప్లస్	10	1	186	68
ఎయిడెడ్	4	4	314	262
కేజీబీవీ	17	0	402	301
ఒకేషనల్	9	0	499	382
సోసియల్ వెల్ఫేర్	11	4	551	574
గవర్నమెంట్	20	15	2203	1729
ప్రైవేటు	78	44	11873	10250
మొత్తం	152	69	16177	13765

సర్వం సిద్ధం



జిల్లా వ్యాప్తంగా మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశాం. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. విద్యార్థులంతా హాల్‌టికెట్లతో తమకు కేటాయించిన కేంద్రాలకు పరీక్ష సమయానికి ముందుగానే చేరుకోవాలి. పిల్లలకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు సిద్ధం చేశాం. ఎవరూ ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయాలి. - బండి వెంకటసుబ్బయ్య, ఆర్ఐవో, ఇంటర్ విద్య

అటు అవకాశవాదం.. ఇటు ఆత్మీయ ఆహ్వానం

- కరివేపాకు చందంలా ఉపయోగించుకున్న టీడీపీ
- సముచితస్థానం ఇవ్వాలనుకుంటున్న వైఎస్సార్‌సీపీ
- సమాలోచనలో పడ్డ శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కడప : 'అవసరం మేరకు వాడుకోవడం, ఆపై కరివేపాకులా వదిలేయడం' టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యగా విశ్లేషకులు వర్ణిస్తారు. అచ్చం అలాంటి పరిస్థితే జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు సతీష్‌కుమార్‌రెడ్డికు ఎదురైంది. పార్టీ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో రాజకీయ పోరాటం చేసినా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు రాజకీయాలకు తెర తీశారు. ఫలితంగా సతీష్‌కుమార్‌రెడ్డి సేవలందించిన చోటే ఛీత్కారాలు చవిచూశారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఇటీవల గౌరవప్రదమైన ఆహ్వానం లభించడంతో సమాలోచనలో పడ్డారు. ప్రత్యక్ష రాజకీయాల్లో చురుగ్గా పాలుపంచుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

వేంపల్లె నాగిరెడ్డి పేరు చెబితే తెలియని పాత తరం నేతలుండరు. ఆయన రాజకీయ వారసుడిగా ఆ కుటుంబం నుంచి వచ్చిన ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి స్వశక్తితో అంచెలంచెలుగా ఎదిగారు. తెలుగుదేశం పార్టీకి పులివెందుల నియోజకవర్గంలో పెద్ద దిక్కుగా నిలిచి రాజకీయ పోరాటం చేశారు. 1999 నుంచి 2019 వరకూ ఐదు టర్మ్‌లు పులివెందుల టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో తలపడ్డారు. ఓడిపోతామని తెలిసినా పోటీ చేస్తూ టీడీపీ పరువు కోసం తాపత్రయ పడ్డారు. అయితే ఆయన టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు ఛీత్కారాలు ఎదుర్కొన్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. దీంతో స్వంత పార్టీలో నేతల కుట్రలు, కుతంత్రాలకు విసిగిపోయి.. క్రియాశీలక రాజకీయాలకు కొంతకాలంగా దూరంగా ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి ఆహ్వానం

సీనియర్ నాయకుడు సతీష్‌కుమార్‌రెడ్డి సేవలు వినియోగించుకునేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. అలాగే సముచిత స్థానం కూడా ఇచ్చేందుకు యోచిస్తోంది. ఆ మేరకు వైఎస్ఆర్- కర్నూలు ఉమ్మడి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్లు కె.సురేష్ బాబు, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిలు సతీష్‌కుమార్‌రెడ్డితో చర్చించి పార్టీలో చేరాలని ఆహ్వానించారు. ఈ విషయం తెలుసుకున్న పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి సతీష్‌రెడ్డి ఇంటి ముందు ప్రత్యక్షమయ్యారు. ఎన్నికల్లో సహకరించాల్సిందిగా కోరారు. మరో మారు కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డితో కలిసి వెళ్లారు. బీటెక్ రవి వైఖరి క్షుణ్ణంగా పరిశీలిస్తే సతీష్‌కుమార్‌రెడ్డి పట్ల చిత్తశుద్ధి, నిబద్ధత ఏమాత్రం లేదనే పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ప్రకటన కంటే ముందే సతీష్‌రెడ్డితో చర్చించాల్సి ఉంది. అలా కాకుండా తన అభ్యర్థిత్వం ఖరారు అయ్యేంత వరకూ వేచి ఉండి, ఆ తర్వాత నింపాదిగా సతీష్‌రెడ్డిని కలవడం వెనుక రాజకీయ లబ్ధి పొందాలన్న యోచన ఉన్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. నిజంగా బీటెక్ రవికి చిత్తశుద్ధి ఉంటే కనీసం వేంపల్లె టౌన్‌లో ప్రచారం మొదలు పెట్టేందుకు ముందే రాజకీయ సంప్రదింపులు నిర్వహించాలి. అలా కాకుండా వైఎస్సార్‌సీపీ నేతలు సంప్రదించిన తర్వాత టీడీపీ నేతలు ప్రత్యక్షం కావడం వెనుక రాజకీయ కుట్రకోణం దాగి ఉన్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

సన్నిహితులతో సమాలోచనలు

పులివెందుల తెలుగుదేశం పార్టీ బతికిబట్ట కట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేసిన సతీష్‌కుమార్‌రెడ్డికి ఆ పార్టీలో ఎదురైన చేదు అనుభవాల నేపథ్యం, వైఎస్సార్‌సీపీ నేతల ఆహ్వానించిన క్రమంలో సహచరులు, సన్నిహితులతో సమాలోచనల్లో నిమగ్నమైనట్లు సమాచారం. అధికారంలో ఉండగా ప్రాంతం కోసం, ప్రజల కోసం ప్రతినబూని కృష్ణాజలాలు తీసుకవచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేశారు. ఈ నేపథ్యంలో సతీష్‌కుమార్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఏదేమైనా తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలకం కానున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

రైతన్నకు భరోసా.!

- నేడు వైఎస్సార్ రైతు భరోసా.. సున్నావడ్డీ విడుదల
- జిల్లాలో 2,10,621 మంది రైతులకు రూ. 42.29 కోట్లు మంజూరు
- సున్నా వడ్డీకి సంబంధించి 41,828 మందికి రూ. 10,547 కోట్లు
- ప్రతి రైతు ఖాతాకు సున్నావడ్డీతోపాటు రూ. 2 వేలు నగదు జమ
- నేడు కడప కలెక్టరేట్ సభాభవన్‌లో రైతులకు మెగా చెక్కు అందజేత
- ఆనందంలో అన్నదాతలు

కడప అగ్రికల్చర్ : రైతు భరోసాలో భాగంగా రైతుల ఖాతాకు జమకానున్న ఆఖరి విడత నిధులు..

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు వేసే ప్రతి అడుగులోనూ అండగా ఉంటూ తోడుగా నడుస్తున్నాడు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులను అందజేయడమే కాకుండా పంట దిగుబడులకు సైతం గిట్టుబాటు ధరను కల్పించి మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తూ రైతు కళ్లలో ఆనందాన్ని నింపుతున్నాడు. ముఖ్యంగా రైతన్నలు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ. 13,500 అందిస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతల సొమ్మును రైతన్నలకు అందజేయగా బుధవారం ఐదో విడత సొమ్ము రైతు ఖాతాలకు జయచేయనున్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఈ ఏడాది (2023-24)కి సంబంధించి ఆఖరి విడత ఆర్థిక సహాయం రూ. 2 వేల పెట్టుబడి సాయం నేడు రైతుల ఖాతాలకు జమకానుంది. ఇందుకు సంబంధించి వైఎస్సార్ జిల్లా పరిధిలో 2,10,621 మంది రైతులకు రూ. 42.29 కోట్లు విడుదల కానుంది. అలాగే వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలకు సంబంధించి 41,828 మంది రైతులకు 10,547 కోట్లు సొమ్ము జమ చేయనున్నారు.

అర్హత గల ప్రతి రైతు ఖాతాకు జమ..

ఎన్నికల హామీలో భాగంగా అప్పట్లో వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ. 12,500 అందజేస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చాక మరో రూ. 1000 పెంచి ఏటా రూ. 13,500 అందజేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో గత ఏడాది జూన్ నెలలో ఖరీఫ్ కింద ఒక్కో రైతుకు రూ. 7500 వారి ఖాతాలకు జమచేశారు. ఆ తరువాత అక్టోబర్ నెలలో రబీకి రూ. 4 వేలు ప్రకారం జమ చేశారు. తాజాగా ఆఖరి విడతగా మరో రూ. 2 వేలు ప్రకారం నేడు రైతు ఖాతాలకు నగదును జమ చేయనున్నారు. ఇలా మొత్తంగా ఏటా ఒక్కో రైతుకు రూ. 13,500 ప్రకారం పెట్టుబడి సాయం అందజేస్తున్నారు.

సున్నావడ్డీకి సంబంధించి..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువు దీరిన ప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా రైతులకు సున్నావడ్డీని అందజేస్తున్నారు. అందులో భాగంగా 2021-22 రబీ సీజన్‌లో లక్ష లోపు రుణాలు తీసుకున్న 15,638 మంది రైతులకు సంబంధించి రూ. 3.867 కోట్ల రూపాయలను, అలాగే 2022 ఖరీఫ్ సీజన్‌కుగాను 26,190 మందికి సంబంధించి రూ. 6.680 కోట్ల రూపాయలు ఇలా రబీ, ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి 41,828 మందికి రూ. 10.587 కోట్లు నేడు రైతుల ఖాతాలకు జమ కానుంది.



సున్నా వడ్డీ 2021-22 రబీ, 2022 ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి..

నియోజకవర్గం/ మండలం	రైతుల సంఖ్య	జమకానున్న నగదు (కోట్లలో)
బద్వేల్	37396	7.49
జమ్మలమడుగు	37432	7.51
కడప	1729	0.35
కమలాపురం	32752	6.55
మైదుకూరు	39557	7.94
ప్రొద్దుటూరు	11811	2.36
పులివెందుల	43392	8.78
ఒంటిమిట్ట	3100	0.62
సిద్దవటం	3452	0.69
మొత్తం	210621	42.29

నియోజకవర్గం /మండలం	రైతుల సంఖ్య	జమకానున్న నగదు (కోట్లలో)
బద్వేల్	4456	1.245
జమ్మలమడుగు	8500	2.130
కడప	45	0.008
కమలాపురం	7061	1.747
మైదుకూరు	6915	1.670
ప్రొద్దుటూరు	2556	0.668
పులివెందుల	11745	2.937
ఒంటిమిట్ట	133	0.036
సిద్దవటం	417	0.107
మొత్తం	41828	10.547

నేడు కలెక్టరేట్ సభాభవన్‌లో..

రైతు భరోసా ఆఖరి విడత ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 2 వేల పెట్టుబడి సాయం, అలాగే లక్ష రూపాయలలోపు రుణం తీసుకుని రైతులకు సున్నావడ్డీ కింద నగదు నేడు రైతుల ఖాతాలో జమ కానుంది. ఇందుకు సంబంధించి జిల్లా కార్యక్రమాన్ని నేడు కడప కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో నిర్వహిస్తున్నాము. ఈమేరకు ఏర్పాట్లను పూర్తి చేశాము.

\- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి



గన్‌మెన్ తొలగింపు

ప్రొద్దుటూరు : సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు, కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి మంగళవారం నుంచి గన్‌మెన్‌ను తొలగించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి పోలీసు ఉన్నతాధికారులు ఈయనకు వన్ ప్లస్ వన్ పద్ధతిలో గన్‌మెన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు గన్‌మెన్‌ను తొలగించారు.

టైర్ల వ్యాపారిపై దాడి ఘటనలో..

సీఎం సురేష్‌నాయుడు, మల్లేల లింగారెడ్డి సహా 12 మందిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వెంగళరెడ్డిపేటకు చెందిన టైర్ల వ్యాపారి కోగటం అమీర్ హంజాపై దాడి చేసిన ఘటనలో టూ టౌన్ పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి అమీర్ హంజాను పాత బస్టాండు సమీపంలోని అన్న క్యాంటీన్‌లోకి పిలిపించి టీడీపీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. అమీర్ హంజా కుటుంబ సభ్యులు ఇటీవల కాలంలో వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దీన్ని మనసులో పెట్టుకున్న టీడీపీ నాయకులు అతన్ని అన్న క్యాంటీన్ వద్దకు పిలిపించి దాడికి పాల్పడ్డారు. అమీర్ హంజాను బెదిరింపులకు గురి చేసి ఇంట్లో ఉన్న విలువైన డాక్యుమెంట్లు, కారును తెప్పించుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు వీఎస్ ముక్తియార్, సీఎం సురేష్‌నాయుడు, మల్లేల లింగారెడ్డి, ఖలీల్, ఎర్రబల్లి దాదాపీర్, రెహమాన్, డాక్టర్ గౌస్, పవన్, ఆజాద్, లెజెండ్ (మార్కెట్), హరూన్, మన్సూర్‌లపై 147, 148, 324, 352, 386 రెడ్‌విత్ 149 ఐపీసీ సెక్షన్ల కింద టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



జిల్లా ఆస్పత్రిలో అమీర్ హంజాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

టైర్ల వ్యాపారిని పరామర్శించిన ఎమ్మెల్యే రాచమల్లు

టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన అమీర్ హంజాను సోమవారం రాత్రి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి జిల్లా ఆస్పత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న అమీర్ హంజాను పరామర్శించారు. దాడి ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అధైర్య పడొద్దని, మీ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే సోదరుడు రాచమల్లు కిరణ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్లు ఖాజా, పార్టీ నాయకులు అమీర్ హంజాను పరామర్శించారు.

తండ్రి చేతిలో తనయుడి హతం

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. మద్యానికి బానిసైన కన్న కొడుకును తండ్రి మంగళవారం మధ్యాహ్నం రోకలి బండతో తలపై మోది చంపాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండపేట గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి (39)కి పదేళ్ల క్రితం వివాహమైంది. చెడు అలవాట్లకు బానిసగా మారిన ఓబుళరెడ్డిని భార్య ఏడాదికే వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి అతను తండ్రి ఉండేల చిన్న రామిరెడ్డి, తల్లి ఆదిలక్ష్మితో కలిసి ఉండేవాడు. అయితే మద్యానికి బానిస అయిన అతను తల్లిదండ్రులను మద్యానికి డబ్బులు ఇవ్వాలని రోజూ వేధించేవాడు. ఈ క్రమంలో సోమవారం తండ్రిని మద్యానికి డబ్బులు అడగగా అతను లేవని చెప్పడంతో అతనితో గొడవకు దిగాడు. తండ్రిని గొంతుపై కాలితో తొక్కడంతో అక్కడే ఉన్న అతని తోబుట్టువులు అతనిని మందలించి పంపించారు. కాగా మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో తల్లి బ్యాంకు పనిమీద చెన్నూరుకు వెళ్లగా ఎవరూ లేని సమయంలో మద్యానికి డబ్బులు ఇవ్వాలని తండ్రితో గొడవ పడ్డాడు. ఈ గొడవలో తండ్రి ఇంట్లో ఉన్న రోకలి బండ తీసుకొని తన కొడుకు ఓబుళరెడ్డి తలపై బాదడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పార్థసారథి తెలిపారు.



ఓబుళరెడ్డి మృతదేహం

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె గ్రామంలో లావణ్య (20) అనే వివాహిత సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఏఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన సమాచారం మేరకు మృతురాలు లావణ్యది శ్రీకాకుళం జిల్లా, దివానిపాలెం. కాగా గత నెలలో చింతకొమ్మదిన్నెకు చెందిన గణేష్ రెడ్డితో వివాహమైంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉరివేసుకొని మృతి చెందింది. ఈ విషయం తమ దృష్టికి రావడంతో మృతురాలి తండ్రి హరికృష్ణకు సమాచారం ఇచ్చి విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ సాయంతో ఆర్‌టీఐ చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా పొందవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడి అనురాధ పేర్కొన్నారు. మంగళవారం కడప డీఈఓ కార్యాలయం వద్ద ఏడీ మునీర్‌ఖాన్, సూపరింటెండెంట్ బాదుల్లా, సెక్టోరియల్ ఆఫీసర్ చల్లా విశ్వనాథరెడ్డిలతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకంలో ఉచితంగా సీట్లు పొందిన వారు నేరుగా 1వ తరగతిలో అడ్మిషన్ పొందవచ్చన్నారు. వీరికి ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందన్నారు. రిజిస్టర్ అయిన ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, సీడబ్ల్యూఎస్‌ఎన్ వర్గాలకు ఈ సీట్లను కేటాయిస్తారని చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ కోసం మార్చి 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమానాల నివృత్తికి 18004258599 నంబరులో సంప్రదించాలని డీఈఓ సూచించారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన డీఈఓ అనురాధ, ఏడీ మునీర్‌ఖాన్, సూపరింటెండెంట్ బాదుల్లా తదితరులు

ఆలయ పూజారి అదృశ్యం

విలువైన వెండి ఆభరణాలు, ఉత్సవ విగ్రహం మాయం

ఖాజీపేట : ఖాజీపేటలోని సాయిబాబా ఆలయ పూజారి నాలుగు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. ఆయన అదృశ్యంతో ఆలయంలోని విలువైన వెండి ఆభరణాలు మాయమైన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. ఖాజీపేట టౌన్‌లో ఉన్న సాయిబాబా ఆలయం పూజారి వెంకట ప్రసాద్ శర్మ (31) ఈనెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదు. భార్య హేమలత కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 23వ తేదీ ఉదయం 9 గంటలకు కడపలో తెలిసిన వారి గృహ ప్రవేశానికి వెళుతున్నట్లు తన భర్త చెప్పాడన్నారు. అప్పటి నుంచి ఇంత వరకూ ఇంటికి తిరిగి రాలేదని ఆమె ఖాజీపేట సీఐ రామాంజులుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు 26వతేదీ మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఆలయంలో వెండి ఆభరణాలు మాయం

పూజారి కనిపించకపోగా అదే సమయంలో ఆలయంలో విలువైన వెండి ఆభరణాలు మాయమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయంలో ఉన్న ఉత్సవ విగ్రహం సుమారు 5 కేజీలు ఉంటుందని, అలాగే వాటితో పాటు మరికొన్ని వెండి ఆభరణాలు ఉన్నాయని వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీటి విలువ సుమారు రూ.8లక్షలు ఉంటుందని చెబుతున్నారు.

పోలీసుల విచారణ : పూజారి అదృశ్యం కావడంతోపాటు వెండి ఆభరణాల మాయమైన సంఘటనపై ఖాజీపేట పోలీసులు విచారణ మొదలు పెట్టారు. వెండి ఆభరణాలు పూజారి అపహరించాడా లేక మరేవైనా కారణాలు ఇందులో ఉన్నాయా అన్నది తేలాలంటే పూజారి ఆచూకీ తెలియాల్సిందేనని పోలీసులు అంటున్నారు.

పోగొట్టుకున్న బ్రేస్‌లెట్ మహిళకు అప్పగింత

ప్రొద్దుటూరు క్రైం : బస్సులో ఓ మహిళ తన బంగారు బ్రేస్‌లెట్‌ను పోగొట్టుకుంది. అయితే అదే బస్సులో ప్రయాణిస్తున్న ఎస్ఐ పుల్లన్న చొరవతో బ్రేస్‌లేట్‌ను వెతికి బాధిత మహిళకు అందజేశారు. వివరాలు ఇలా.. ప్రొద్దుటూరుకు చెందిన ఒక మహిళ మంగళవారం బస్సులో కడపకు బయలుదేరింది. కడపలో పీసీఆర్ ఎస్ఐగా పని చేస్తున్న పుల్లన్న అదే బస్సులో కడపకు బయలుదేరారు. ప్రయాణిస్తున్న సమయంలో ఆమె వద్ద ఉన్న బంగారు బ్రేస్‌లెట్ ఎక్కడో పడిపోయింది. అయితే కడప సమీపంలోకి వెళ్లిన తర్వాత బస్సు దిగే సమయంలో చూసుకోగా బ్రేస్‌లెట్ కనిపించలేదు. ఎస్ఐ పుల్లన్న చొరవ తీసుకొని బస్సులో వెతకగా బ్రేస్‌లెట్ కనిపించింది. ఎస్ఐకి మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పెండ్లిమర్రి : మండలంలోని చాబలి రెవెన్యూ పొలం పరిధిలో ఉన్న ఐరన్ ఓర్ మైన్స్‌లో మంగళవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో గోపరాజుపల్లె గ్రామానికి చెందిన పంగా పెద్ద గంగన్న(40 మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... పెద్ద గంగన్న చిన్న చిన్న విద్యుత్ మరమ్మతుల పనులు చేసేవాడు. ఐరన్ ఓర్ మైన్స్‌లో విద్యుత్ స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కింద పడ్డాడు. చికిత్స నిమిత్తం కడపకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. దీనిపై ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ షాక్‌తో మరణించాడా లేక ప్రమాదవశాత్తు కిందపడ్డాడా అనేది విచారణలో తెలుస్తుందన్నారు.

ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం కావాలి

కడప సెవెన్‌రోడ్స్ : రానున్న సార్వత్రిక, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా సంసిద్ధం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాలులో ఆయన జేసీ గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషలతో కలిసి రానున్న ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్లక్ష్యం వహిస్తే క్రమ శిక్షణా చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీఓ రమణ, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, ఎస్ఎస్ఏపీఓ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, సీపీఓ వెంకటరావు, ఎన్ఐసీ డీఐఓ విజయ్ కుమార్, ఇతర నోడల్ అధికారులు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'జానమద్ది'



జానమద్ది హనుమచ్ఛాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : ప్రముఖ కవి, రచయిత జానమద్ది హనుమచ్ఛాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మునిరావువీధిలోని కొండూరు పిచ్చమ్మ వెంకట రాజు స్మారక సంస్థ కార్యాలయంలో జానమద్ది 10వ వర్ధంతిని జరిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి, హనుమచ్ఛాస్త్రి లాంటి గొప్ప వ్యక్తులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. స్మారక సంస్థ అధ్యక్షుడు కొండూరు జనార్దన రాజు మాట్లాడుతూ బ్రౌన్ లైబ్రరీకి ఆయన చేసిన సేవ మరువరానిదన్నారు. శాస్త్రి కుమారుడు జానమద్ది నాగరాజు మాట్లాడుతూ తమ తండ్రి చివరి వరకూ పుస్తకాలు రాస్తూనే ఉండేవారని కొనియాడారు. తొలుత జానమద్ది చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు చిల్లూరి రెడ్డెయ్య రాజు, గొబ్బూరి కోటేశ్వరరావు, డేవిడ్, సతీష్, జ్యోతి జార్జి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

నేడు కడపలో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, ప్రభుత్వ పురుషుల కళాశాల, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలలో వివిధ హోదాల్లో పనిచేసేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చదివి 18-35 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు ఈ ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. ఎంపికైన వారికి వారి హోదా, అర్హతలను బట్టి రూ. 13-30 వేల వరకు వేతనం ఉంటుందన్నారు.

యువకుడి అదృశ్యం



మల్లికార్జున (ఫైల్)

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట అరుంధతివాడకు చెందిన చెంచుగొల్ల మల్లికార్జున (29) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతని తల్లి ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు మల్లికార్జున ఈనెల 24వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు కడపలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం గురించి మాట్లాడి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తమకు తెలిసిన గృహాలను, ప్రదేశాలను, ఊర్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మల్లికార్జున తల్లి చెంచుగొల్ల రాజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు.